

కక్కలపల్లి క్రాస్‌లో మోహరించిన 'ది అనంతపూర్ హెవీ గూడ్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్' వాహనం, సభ్యులు

మార్కెట్‌లో మాఫియా..!

అసోసియేషన్‌ల పేరిట రౌడీయిజం



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న బయ్యర్లు, రైతులు



అసోసియేషన్ వాహనాన్ని చుట్టుముట్టిన బయ్యర్లు, రైతులు



బయ్యర్లకు సర్దిచెబుతున్న డీఎస్పీ, పోలీసులు

- వేరే వాహనం రావాలంటే డబ్బు కట్టాల్సిందే
- ఒక్కో వాహనదారుడి నుంచి రూ.3 వేలు వసూలు
- ఇవ్వకుంటే వాహనాలు, రికార్డులను లాక్కుంటారు
- కప్పం కట్టినవారికీ ఆలస్యంగానే అనుమతి
- తమ వాహనాలు నిండాకే వాటి లోడింగ్
- తీవ్రంగా నష్టపోతున్న బయ్యర్లు, రైతులు
- కక్కలపల్లి టమోటా మార్కెట్ వేరే దేశంలో ఉందా..?
- హైవేపై ఆందోళనకు దిగిన బాధితులు

కక్కలపల్లి టమోటా మార్కెట్..! రైతులు, వ్యాపారులు, వాహనదారులు, చిరు వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు, హమాలీలు, కూలీలు.. ఇలా ఎందరికో ఉపాధి కల్పించే చోటు. వచ్చిపోయే వారితో ఏడాదిలో ఆరు నెలలపాటు కళకళలాడుతుంటుంది. అనంతపురం నగర శివారులో.. జాతీయ రహదారి సమీపంలో ఉంటున్న ఈ మార్కెట్‌లో పైకి కనిపించే దృశ్యం ఇది. కానీ ఇది మాఫియా గుప్పిట్లో ఉందంటే అతిశయోక్తి కాదు. వేరే రాష్ట్రాల వాహనాలు రావాలంటే కప్పం కట్టాలి. సొంత వాహనాలున్న టమోటా రైతులు రావాలన్నా కప్పం కట్టి తీరాలి. హైవేపై ఓ వాహనంలో ఉండే ముఠా.. రేయింబవళ్లూ రౌడీ మామూళ్ల వసూళ్లను పర్యవేక్షిస్తుంటుంది. అధికార పక్షం, ఇటీవలే అధికారం కోల్పోయిన పక్షం, వామపక్షం.. ఇలా ఏ పక్షమూ బాధితుల పక్షాన నిలబడటం లేదు. జిల్లా కేంద్రంలో ఉండే కలెక్టర్, ఎస్పీ, మార్కెటింగ్, పంచాయతీ, రెవెన్యూ.. ఇలా ఏ శాఖ అధికారులూ అటువైపు కన్నెత్తి చూడరు. 'ఇదేమైనా వేరే దేశంలో ఉందా..?' అని బాధితుల్లో ఒకరు ఆక్రోశం వ్యక్తం చేశారంటే.. దీన్ని అడ్డుకోలేనివారిది అసమర్థతా..? అవినీతా..? అంతిమంగా నష్టపోయేది రైతులే కదా..!

అనంతపురం రూరల్, ఆగస్టు 19: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో అసోసియేషన్ల పేరిట రౌడీ మామూళ్ల వసూలు చేస్తున్నారు. దారికాచి దౌర్జన్యం చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని లారీ డ్రైవర్ల నుంచి వాహనాల రికార్డులను లాక్కుంటున్నారు. భయపడి డబ్బులు చెల్లించినా.. వారి వాహనాలను మార్కెట్‌లోకి పంపడం లేదు. అసోసియేషన్ సభ్యుల వాహనాలు లోడింగ్ అయిన తరువాతనే కప్పం కట్టినవారి వాహనాలను అనుమతిస్తున్నారు. హెవీ గూడ్స్ లారీ, క్లీనర్స్, మండీల పేరిట అసోసియేషన్‌లు ఏర్పాటు చేసుకుని.. ఎవరి స్థాయిలో వారు వసూళ్లకు తెగబడుతున్నారు. వీరి దెబ్బకు వ్యాపారులు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. 'ఈ మార్కెట్ వద్దు.. ఈ వ్యాపారమూ వద్దు..' అని కొందరు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రౌడీ మామూళ్ల పర్వం శ్రుతిమించడంతో కొందరు వాహనదారులు, బయ్యర్లు సోమవారం ఉదయం టమోటా మార్కెట్ సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. మార్కెట్‌కు, వాహనాల అసోసియేషన్లకు ఏం సంబంధమని నిలదీశారు. మార్కెట్ క్రాస్‌లో హెవీ గూడ్స్ అసోసియేషన్ సభ్యులు దారి కాచి దౌర్జన్యాలకు దిగడం ఏమిటని మండిపడ్డారు. అసోసియేషన్ వారి ఫర్నిచర్‌ను రోడ్డుపై వేసి నిప్పు పెట్టారు. వారి ఆందోళనతో హైవేపై మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పంచాయతీని కోర్టుకెక్కించి..

కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించి, సుంకం వసూలు చేసేవారు. కోర్టు ఉత్తర్వుల పేరిట హెవీ గూడ్స్ లారీ అసోసియేషన్‌వారు దీన్ని అడ్డుకున్నారు. మండీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వసూళ్లు ప్రారంభించారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో 'టమోటా మార్కెట్‌లో నయా దందా' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. మండీ అసోసియేషన్ తరహాలోనే 'ది అనంతపురం హెవీ గూడ్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్', మరో రెండు మూడు అసోసియేషన్లు దందాలను సాగిస్తున్నాయి. మినీలారీ అసోసియేషన్, క్లీనర్స్ అసోసియేషన్ అంటూ మరో రూ.వెయ్యికి పైగా వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

దిక్కున్నచోట చెప్పుకోవాలట..

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఏకంగా రౌడీయిజానికి దిగుతోంది. ఇతర ప్రాంతాల వాహనాలను, జిల్లాలో సొంత వాహనాలు ఉన్నవారిని మార్కెట్‌లోకి అడుగు పెట్టనివ్వడం లేదు. కక్కలపల్లి క్రాస్‌లో దారి కాచి మరీ వారిని బెదిరిస్తున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వందే మార్కెట్‌లోకి వెళ్లడానికి వీల్లేదని హెచ్చరిస్తున్నారు. కక్కలపల్లి క్రాస్‌లో ఈ అసోసియేషన్‌కు సంబంధించిన ఓ వాహనంలో 24 గంటలూ కాపలాగా ఉంటున్నారు. బయటి వాహనాలు కనిపించగానే విరుచుకుపడుతున్నారు. ఒక్కొక్క వాహనానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ వసూలు చేస్తున్నారు. కొందరితో రూ.5 వేలు కూడా వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లకు ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. కొందరికి రసీదులు ఇచ్చినా.. ఎందుకూ పనికిరావని అంటున్నారు. స్వలాభం కోసం అసోసియేషన్ ముసుగులో ఈ దందా నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెప్పినట్లు వినకపోతే వాహనాలను తమ అసోసియేషన్ కార్యాలయానికి తీసుకెళుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వాహనాల రికార్డులను లాక్కుంటున్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని బెదిరిస్తున్నారు.

దోపిడీకి పరాకాష్ట

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో దోపిడీ పరాకాష్టకు చేరింది. ఇలాంటి పరిస్థితి ఏ మార్కెట్‌లోనూ లేదని బయ్యర్లు అంటున్నారు. ఎక్కడైనా పది రూపాయలు తక్కువ బాడుగ అంటే.. ఆ వాహనాలకు ప్రాధాన్యం ఉంటుంది. కానీ అసోసియేషన్‌ల తీరు భిన్నంగా ఉంది. ఇతర ప్రాంతాల వాహనదారుల నుంచి డబ్బు లు దండుకోవడమే కాకుండా.. తమ సభ్యుల వాహనాలకు భారీగా బాడుగ వసూలు చేస్తున్నారు. తమ వాహనాల లోడింగ్ పూర్తి అయ్యాకే కప్పం వసూలు చేసుకుని ఇతరుల వాహనాలను అనుమతిస్తున్నారు. ఆలస్యంగా లోడింగ్ చేయడమే కాకుండా.. నిర్దిష్ట సమయానికి అన్‌లోడ్ చేయాలని డ్రైవర్లను హెచ్చరిస్తున్నారు. దీంతో సమయానికి గమ్యస్థానం చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారు. రాజకీయ నాయకుల పేర్లను వాడుకుంటున్నారు.

గుర్రం గుడ్డిదైనా..

కక్కలపల్లి మార్కెట్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు ఎక్కువగా టమోటా వెళుతుంది. ఆ ప్రాంత వాహనదారులు ఇక్కడి నుంచి 32 గంటల వ్యవధిలో సరుకును తమ మార్కెట్‌కు చేరుస్తారు. కానీ ఘనత వహించిన ఇక్కడి అసోసియేషన్ వాహనదారులు కనీసం 10 గంటలు ఆలస్యంగా వెళతారు. అంటే.. ముందే బయలుదేరి ఆలస్యంగా వెళతారన్నమాట. ఆలస్యంగా వెళ్లిన యూపీ డ్రైవర్లు మాత్రం ముందే వారి మార్కెట్‌కు చేరుతున్నారు. యూపీ వాహనదారులు రూ.1.20 లక్షల నుంచి రూ.1.40 లక్షల మధ్య బాడుగ తీసుకుంటే.. అసోసియేషన్ వాహనదారులు అంతకంటే రూ.20 వేలు అధికంగా తీసుకుంటున్నారు. కర్ణాటకలోని చింతామణి మార్కెట్ నుంచి యూపీకి చెల్లించే బాడుగ కంటే.. సుమారు 400 కి.మీ. దూరం తక్కువగా ఉండే కక్కలపల్లి మార్కెట్ నుంచి చెల్లించే బాడుగలే ఎక్కువ అంటే.. అసోసియేషన్‌ల దందా ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత చెల్లిస్తున్నా తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని బయ్యర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారిని రానివ్వొద్దు..

రౌడీ మామూళ్లపై గళం విప్పినవారిపై ఓ అసోసియేషన్ నిషేధం విధించింది. అన్యాయం అని గళం విప్పినవారిని మార్కెట్‌లోకి అడుగు పెట్టనివ్వొద్దని హుకుం జారీ చేసింది. 'మాకే వ్యతిరేకంగా రోడ్డు ఎక్కుతారా..? మార్కెట్‌లోకి ఎలా వస్తారో చూస్తాం..' అని తమకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి ఏ మార్కెట్‌లోనూ లేదని అన్నారు.



రైతులు, బయ్యర్ల ధర్నాతో జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

అనంతపురం వేరే దేశంలో ఉందా..?



మార్కెట్‌లో మేము సరుకు కొనుగోలు చేసి.. బండ్ల కోసం అసోసియేషన్ వారిని అడుక్కోవాల్సి వస్తోంది. వారి బండ్లలోనే లోడ్ చేయాలట. వేరే బండ్లలో లోడ్ చేయకూడదని అంటున్నారు. అనంతపురం ఏమైనా వేరే దేశంలో ఉందా..? మార్కెట్‌తో అసోసియేషన్‌కు ఏం సంబంధం? వారి దందా గురించి ప్రశ్నిస్తే లారీలు తీసుకెళ్లిపోతున్నారు. వాహనాల పత్రాలను లాగేసుకుంటున్నారు. మేము చాలా మార్కెట్‌లలో వ్యాపారం చేస్తున్నాం. అక్కడికి వెళ్లిపోతాం. మేం రాకపోతే నష్టపోయేదీ ఇక్కడి రైతులే. ఈ రోజు నా బండి నిలబడిపోయింది. నాకు నష్టం వచ్చింది. నష్టపోయిన డబ్బును అసోసియేషన్ ఇస్తుందా? వారికి డబ్బులు కడుతున్నాం కదా..? అయినా మా లారీలను ఎందుకు ఆపుతున్నారు..? **- సర్దార్, వ్యాపారి**

రికార్డులను లాక్కోవడం ఏమిటి..?



లారీ అసోసియేషన్ వారు వాహనాల పేపర్లు లాక్కోవడం ఏమిటి..? దౌర్జన్యం కాకపోతే..! మార్కెట్‌లోకి వాహనాలను రానివ్వకపోతే సరుకు ఎలా కొంటారు..? ఎలా తీసుకెళ్తారు..? అసోసియేషన్ చేష్టలకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. పంట సాగుకోసం రూ.4.50 లక్షలు ఖర్చు చేశా. ఇక్కడ చూస్తే టమోటా బాక్సు రూ.50కి అమ్ముడుపోతోంది. మందులకు ఎలా కట్టాలి..? కూలీలకు డబ్బులెలా చెల్లించాలి..? బండ్ల బాడుగలు ఏలా చెల్లించాలి..? మండీ, లారీ అసోసియేషన్ వాళ్లేమైనా మా నష్టాన్ని భర్తీ చేస్తారా..? ఎవరి ఇష్టానుసారం వారు వసూలు చేస్తూ పోతే ఎలా..? మార్కెట్‌లో కాయలు అమ్ముడుపోకపోతే మేం ఏం చేయాలి..?

- ఆదిశేషారెడ్డి, రైతు, ఆత్మకూరు

మళ్లీ రోడ్డెక్కుతాం..



అసోసియేషన్‌ల వ్యవహారంతో నష్టపోతోంది రైతుల మాత్రమే. బయ్యర్ల వాహనాలను పది గంటలకు మార్కెట్‌లోకి పంపితే సరుకు కొనేదెప్పుడు..? వాటిని తరలించేది ఎప్పుడు..? బండ్లను మార్కెట్‌లోకి రాన్వికపోవడంతో బయ్యర్లు టమోటా కొనుగోలు చేయడం లేదు. వారొస్తేనే మాకు మేలు జరుగుతుంది. వారే రాకపోతే అసోషియేషన్‌లు సరుకు కొంటాయా..? డబ్బులిస్తాయా..? వారేమో రూ.కోట్లకు కోట్లు కుప్పేసుకోవాలి.. రైతులేమో నష్టపోవాలా..? రైతుల గురించి ఆలోచించేవాడే లేడు. మార్కెట్‌కు బయ్యర్లు వస్తే మాకు మేలు జరుగుతుంది. ఇది ఈ రోజుతో అయిపోదు. ఇలానే జరిగితే మళ్లీ రోడ్డెక్కుతాం. **- మహేంద్ర, రైతు, రాంపురం, కంబదూరు మండలం**

అర్జీదారుల్లో నమ్మకం కలిగించండి

■ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

అనంతపురం టౌన్, ఆగస్టు 19: ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే తమ సమస్యలు పరిష్కారమౌతాయన్న నమ్మకాన్ని ప్రజలలో కలగించాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ హితవు పలికారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్వో రామకృష్ణారెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని అర్జీల గురించి కలెక్టర్ నేరుగా మండల స్థాయి అధికారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. పరిష్కారానికి సూచనలు చేశారు. మొత్తం 276 మంది బాధితులు వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమస్యలు పరిష్కారమౌతాయన్న భరోసాతో వ్యయప్రయాసలకోర్చి ఇంత దూరం వస్తారని, వారిపట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల అనంతపురం అర్బన్, నగరపాలిక పరిధిలో ఫిర్యాదులు ఎక్కువయ్యాయని అన్నారు. వాటిపట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని నగరపాలిక అధికారులు, అర్బన్ తహసీల్దారుకు సూచించారు. ఖాళీల భర్తీకి, ఉద్యోగోన్నతులకు వివరాలు పంపించాలని ఆదేశించారు. పురాతన ఆలయాలు, కట్టడాలను సంరక్షించాలని సూచించారు. ఉచిత ఇసుక విషయంలో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చిన నిపుణులు, కార్మికులను అభినందించారు.

ప్రశాంతత పరిరక్షణే లక్ష్యం

కొత్త ఎస్పీ జగదీష్.. బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు 19: జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే లక్ష్యమని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. డీపీఓలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి పెడతామని, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, నిష్పక్షపాతంగా, చట్టపరంగా వ్యవహరిస్తామని అన్నారు. గంజాయి, సైబర్ నేరాల నియంత్రణలకు గట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆ తరువాత తన ఛాంబర్లో డీఎస్పీలతో సమావేశమయ్యారు. జిల్లాలో తాజా పరిస్థితులను సమీక్షించారు. నేర నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు భరోసా కలిగించే బేసిక్ పోలీసింగ్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీలు టీవీవీ ప్రతాప్, రవికుమార్, జనార్దన్ నాయుడు, శివభాస్కర్‌రెడ్డి, బీవీ శివారెడ్డి, మునిరాజ(ఏఆర్) పాల్గొన్నారు.

ఎందుకో ఇలా..

చిన్న చిన్న విషయాలనూ జిల్లా పోలీసు శాఖ అధికారులు మీడియాకు చెప్పడం లేదు. జిల్లాకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు వచ్చినా, ఇక్కడున్న వారు రిలీవ్ అయినా మీడియా ద్వారా ప్రజలకు తెలుస్తుంది. కానీ పోలీసు శాఖ ఈ వివరాలనే చెప్పడం లేదు. బదిలీ అయిన ఎస్పీ కేవీ మురళీ కృష్ణ బదిలీ ఆదివారం రిలీవ్ అయ్యారు. ఆ విషయం గురించి మీడియాకు చెప్పలేదు. రాత్రి ఎప్పుడో ఫొటోలు పంపితేగానీ విషయం తెలియలేదు. పీఆర్వోకు సైతం సమయానికి చెప్పడంలేదని సమాచారం. కొత్త ఎస్పీ జగదీష్ బాధ్యతలు తీసుకుంటున్న విషయాన్ని కూడా చెప్పడానికి వెనుకాడారు.



ఎస్పీని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

ఆగని నిరసన

- కోల్‌కతా ఘటనపై కఠిన చర్యలు తీసుకోండి
- జూడాల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు, పీజీలు



వైద్యమంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న జూనియర్ డాక్టర్లు

అనంతపురం టౌన్, ఆగస్టు 19: కోల్‌కతా బోధనాస్పత్రిలో పీజీ డాక్టర్ హత్యాచార ఘటనపై అనంతలో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొనసాగుతోంది. వందలాదిమంది డాక్టర్లు, మెడికోలు, జిల్లా ఆస్పత్రి నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లకు భద్రత కల్పించి న్యాయం చేయండి. డాక్టర్‌ను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించండి అంటూ నినదించారు. కలెక్టరేట్ ప్రధాన రోడ్డుపై మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టరు వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కలిసి డాక్టర్లకు భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం తెచ్చేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

స్టాప్‌లాగ్ గేట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్ర



నిధులు ఇవ్వనందుకే గేట్ కొట్టుకు పోయింది

ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని

రాయదుర్గం, ఆగస్టు 19: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే తుంగభద్ర జలాశయం క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిందని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు ఆరోపించారు. వారిద్దరూ సోమవారం టీబీడ్యాంను సందర్శించారు. 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో అమర్చిన స్టాప్‌లాగ్‌ను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. అనంతరం కాలవ మీడియాతో మాట్లాడారు. గేట్ల దుస్థితిపై రెండేళ్ల క్రితమే నిపుణులు హెచ్చరించారని అన్నారు. టీబీ బోర్డుకు గత ప్రభుత్వం సహకరించలేదని, డ్యాం నిర్వహణకు నిధులు ఇవ్వలేదని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చొరవ తీసుకుని నిధులు విడుదల చేస్తున్నారని అన్నారు. మిగిలిన గేట్ల భద్రతకు బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కర్ణాటక, ఏపీ ప్రభుత్వాలు తుంగభద్ర పరిధిలో కొత్త పథకాల ఏర్పాటు గురించి ఆలోచన చేస్తున్నాయని అన్నారు. కర్ణాటకలో నౌని రిజర్వాయర్, ఏపీ ప్రభుత్వం సమాంతర కాలువ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయని అన్నారు. దీనిపై బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల పరిధిలో లక్షలాది ఎకరాల రైతులు ఆందోళన పడుతున్న దశలో కన్నయ్యనాయుడు స్టాప్‌లాగ్‌ను అమర్చి నీటిని ఆదా చేశారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర కొనియాడారు. ఆయనను త్వరలో జిల్లాకు రప్పించి రైతుల సమక్షంలో ఘనంగా సన్మానించాలనే ఆలోచన ఉందని అన్నారు. టీబీ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి చర్చించారు. కొత్తగేట్ల అమరిక కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, ఏపీ వాటా నిధులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.



టి ప్రాజెక్టులకు నీరసం!

జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోని గత ప్రభుత్వం

- నిర్వహణకు చిల్లిగవ్వ ఇవ్వని వైనం
- పలు చోట్ల శిథిలావస్థకు చేరుకున్న గేట్లు
- జిల్లా అధికారుల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- కూటమి ప్రభుత్వంలో మంచి రోజులు వచ్చేనా?

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: ఇటీవల తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని నీటి ప్రాజెక్టులపైన సందేహాలు తలెత్తుతున్నాయి. వైసీపీ పాలనలో నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో ప్రాజెక్టుల భద్రతపై అనుమానాల రేకెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 12 రిజర్వాయర్లు ఉన్నాయి. ఇందులో హెచ్చెల్సీ కింద పీఏబీఆర్, ఎంపీఆర్, ముచ్చుకోట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, చాగల్లు, సుబ్బరాయసాగర్, పెండేకల్లు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటికి తుంగభద్ర డ్యాం నుంచి నీటిని తరలిస్తున్నారు. ఇక హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల రిజర్వాయర్లు నిర్మించారు. శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను జిల్లాకు తరలిస్తున్నారు. వీటితో పాటు మైనర్ ఇరిగేషన్ పరిధిలో పేరూరులో అప్పర్ పెన్నార్ రిజర్వాయర్, గుమ్మఘట్ట వద్ద భైరవాన్ తిప్ప ప్రాజెక్ట్‌లను నిర్మించారు. ఉమ్మడిజిల్లాకు తాగునీరందించే మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన సీబీఆర్‌ను కడప జిల్లా అధికారులు పర్యవేక్షిస్తారు. వీటి నిర్వహణకు ప్రతి ఏటా నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తే ఆయా ప్రాజెక్టులు మరింత కాలం మన్నికగా ఉండి ప్రజల అవసరాలు తీరుస్తాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాజెక్టుల నిర్వహణకు పుష్కలంగా నిధులు వస్తే మంచి రోజులు వచ్చినట్లేనని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను గాని వాటి నిర్వహణను గాని పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో జలవనరుల శాఖ పరిధిలోని రిజర్వాయర్ల నిర్వహణ భారంగా మారింది. ఆర్థిక భారంతో ఇంజనీర్లు పూర్తిగా చేతులెత్తేశారు. నిధులు లేకుండా ప్రాజెక్ట్‌ల నిర్వహణ సాధ్యం కాదని తెగేసి చెప్పేశారు. 2014-19 కాలంలో ప్రాజెక్ట్‌లతో పాటు కాలువల నిర్వహణకు అప్పటి టీడీపీ ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారుల ప్రతిపాదనల ప్రకారం నిధులు చెల్లిస్తూ వచ్చింది. అప్పట్లో దాదాపుగా ప్రాజెక్ట్‌ల నిర్వహణలో సమస్యలు ఉత్పన్నం కాలేదు. 2019-24 ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చిల్లిగవ్వకూడా ప్రాజెక్ట్‌ల నిర్వహణకు నిధులు చెల్లించలేదు. పైగా జలవనరుల శాఖ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలు చెత్తబుట్టలోకి వేసేశారు. అలా ప్రాజెక్ట్‌ల నిర్వహణను నిర్లక్ష్యం చేసిన ఫలితమే ప్రస్తుతం సందేహాలు తలెత్తడానికి కారణమవుతోంది.

శిథిలావస్థలో ఎంపీఆర్ గేట్లు

హెచ్చెల్సీ కింద మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్)ను 1966లో నిర్మించారు. దీని పూర్తి నిల్వ సామర్థ్యం 5.170టీఎంసీలు. అయితే ప్రస్తుతం 4.5టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేస్తున్నారు. 2014-19 ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎంపీఆర్ నిర్వహణకు రూ.5 కోట్ల వరకు వెచ్చించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ పాలనలో రూ.4లక్షలు మాత్రమే ఖర్చు పెట్టారు. ఎంపీఆర్ గేట్లు శిథిలావస్థకు చేరాయి. గేట్లు మార్చాల్సిన పరిస్థితి ఉంది. సుమారు రూ.25కోట్లతో గేట్ల మరమ్మతులు, మార్పులకుగాను హెచ్చెల్సీ అధికారులు ప్రతిపాదనలు పంపారు.

సీబీఆర్ సామర్థ్యం 10 టీఎంసీలు

చిత్రవతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)ను 2002లో నిర్మించారు. దీని పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 10టీఎంసీలు. కడప జిల్లా సరిహద్దు పార్నపల్లి వరకు ఈ నిర్మాణం ఉంది. అయితే ప్రస్తుతం ఆరు టీఎంసీల వరకు మాత్రమే నీటిని నిల్వ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కదిరి, ధర్మవరం, ముదిగుబ్బ, పుట్టపర్తి ప్రాంతాలకు తాగునీటి అవసరాలను తీరుస్తోంది. అంతేగాక సుమారు 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది.

గత ఐదేళ్లలో నిధులు సున్నా

చాగల్లు రిజర్వాయర్ హెచ్చెల్సీ కింద ఉంది. 2012లో 1.5టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. 2015లో పెండేకల్లు రిజర్వాయర్ నిర్మించారు. దీని సామర్థ్యం 0.650టీఎంసీలు. ముచ్చుకోట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 1998లో 0.668 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. సుబ్బరాయసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 1990లో 0.420టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించారు. ఈ రిజర్వాయర్ల నిర్వహణ, గేట్ల మరమ్మతులకు నిధులు అవసరం ఉంది. గత ఐదేళ్లలో ఈ రిజర్వాయర్లకు నిధులు చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది.


1961లో బీటీపీ నిర్మాణం

భైరవాన్‌తిప్ప ప్రాజెక్ట్‌ను 1961లో నిర్మించారు. దీన్ని తుంగభద్ర నదికి ఉపనదిగా ఉన్న వేదవతిహగరిపై నిర్మించారు. 1961లో ఆ ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం సుమారు 4.9 టీఎంసీల నికర జలాలు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కింద స్థిరీకరించిన 12వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జీడిపల్లి నుంచి బీటీపీకి కృష్ణా జలాలు తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2019లో ప్రభుత్వం మారడంతో అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తే కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో సాగు, తాగు నీటికి ఇబ్బంది ఉండదు.

ఎప్పుడూ నిండని పీఏబీఆర్

జిల్లాలో అతిపెద్ద రిజర్వాయర్ పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) 1994లో నిర్మించారు. దీని పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలు. అయితే ఇప్పటి వరకు ఆస్థాయిలో ఎప్పుడూ నీటిని నిల్వ ఉంచలేదు. పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉంచాలంటే మిగిలిన భూసేకరణ చేపట్టి, స్టోరేజీ కెపాసిటీని పెంచాలి. మరో 3వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉంది. పీఏబీఆర్ సామర్థ్యం అంచనా వేసేందుకు టెస్టులకు గాను పూణేకు చెందిన సీడబ్ల్యూసీ కంపెనీ రూ.5 కోట్లు అవసరం అని పేర్కొంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. 11టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి మరో రూ.450కోట్లు నిధులు అవసరం ఉంది. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పీఏబీఆర్ నిర్వహణ, మరమ్మతులకు ఐదేళ్లలో సుమారు రూ.18కోట్ల వరకు వెచ్చించింది. 2019-24 వరకు ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం రూ.10లక్షలు మాత్రమే చెల్లించింది. గేట్ల మరమ్మతులకు అత్యవసరంగా రూ.2కోట్ల వరకు నిధులు అవసరం ఉంది. ఇక పీఏబీఆర్ లీకేజీ మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం వైసీపీ పాలనలోనే ఐదు దఫాలుగా హెచ్చెల్సీ అధికారులు పంపారు. అయినా ఏమాత్రం ఫలితం లేదు.





జలవనరుల శాఖ కార్యాలయం

2001లో యోగివేమన ప్రాజెక్ట్

ముదిగుబ్బ మండలంలో 2001లో యోగివేమన రిజర్వాయర్‌ను నిర్మించారు. దీని సామర్థ్యం 0.900టీఎంసీలు. ప్రస్తుతం 0.839 టీఎంసీల నీటిని నిల్వ చేయగలుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క పైసా కూడా నిర్వహణకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఉన్న 11గేట్లు పూర్తిగా పాడైపోయాయి. గేట్లు మరమ్మతు చేయాల్సి ఉంది. తుప్పుపట్టకుండా గేట్ల నిర్వహణకు ఆయిల్, గ్రీజు, రంగులు వేయాల్సిన అవసరం ఉంది. గేట్లు రిపేరీలో ఉండడంతో నీరు లీకు అవుతోంది.



- హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు నిర్మించారు. ఇందులో 2018లో టీడీపీ ప్రభుత్వం కదిరి మండలంలో చెర్లోపల్లి రిజర్వాయర్‌ను నిర్మించింది. 1.608టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 0.337టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన ఐదేళ్లలో గేట్ల మరమ్మతులు, షట్టర్ల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. గేట్ల మరమ్మతులు, నిర్వహణకు సుమారు రూ.50లక్షలు కావాలని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం అధికారులు ప్రతిపాదనలు పంపారు.
- జీడిపల్లి రిజర్వాయర్ 2012లో నిర్మించారు. 1.681టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్ నుంచి కిందికి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపుతున్నారు.
- మారాల రిజర్వాయర్ 2017లో నిర్మించారు. 0.483టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించారు.
- 2017లో గొల్లపల్లి రిజర్వాయర్ 1.913టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించారు.
- హంద్రీనీవా కింద నిర్మించిన రిజర్వాయర్ల నిర్వహణ గేట్ల మరమ్మతులు, ఆయిల్, గ్రీజ్‌కు అవసరమైన నిధులు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో నిర్వహణ భారం అధికమైందని ఇంజనీర్లు చెప్పుకొస్తున్నారు.



చెర్లోపల్లి రిజర్వాయర్

1958లోనే పేరూరు డ్యాం పూర్తి

పేరూరు అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణానికి 1950లో శంకుస్థాపన జరిగింది. 1958లో నిర్మాణం పూర్తి అయింది. ఇందుకోసం రూ.1.86కోట్లు వెచ్చించారు. ఇందులో డ్యాం నిర్మాణానికి రూ.1.33కోట్లు, కాలువ నిర్మాణానికి రూ.25, 54,560, తూములు, పిల్లకాలువలకు రూ.11లక్షలు, హెడ్‌వర్క్స్ మిషనరీకి రూ.11లక్షలు వెచ్చించినట్టు అప్పటి లెక్కల బట్టి తెలుస్తోంది. పేరూరు డ్యాం ఎత్తు 63 అడుగులు కాగా సీలెవల్ 1763 నీటి నిల్వ సామర్థ్యం 1.816 టీఎంసీలు. అయితే దశాబ్దాల పాటు నిరుపయోగంగా ఉండటంతో ప్రాజెక్టులో పూడిక ఏర్పడింది. దీంతో ప్రస్తుతం దాని నీటి నిల్వ సామర్థ్యం 20 అడుగులు తగ్గింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో రామగిరి మండలంలోని కొండాపురం, కంబదూరు మండలంలోని కురాకులపల్లి, కర్ణాటకలోని తిమ్మంపల్లిలో కొంత భాగం ముంపునకు గురైంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు నిధులు కేటాయించింది. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు చెల్లించకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది.

ప్రతిపాదనలపై కసరత్తు



ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, పరిస్థితులపై ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలు పంపేందుకు కసరత్తు చేస్తున్నాం. ప్రాజెక్టుల నిర్వహణ, కాలువల నిర్వహణకు నిత్యం నిధులు అవసరం ఉంది. గత ఐదేళ్లలో ప్రభుత్వానికి నిధుల కోసం పంపిన ప్రతిపాదనలు ఉన్నతాధికా రులు పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ కష్టంగా మారింది. తాజాగా నిధులకు ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జలవనరుల శాఖ ఇంజనీర్ల నుంచి సమగ్రంగా వివరాలు తీసుకున్న తర్వాత నివేదికలను త్వరలో పంపుతాం.

- నాగరాజ, ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల చీఫ్ ఇంజనీర్ (సీఈ)

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కేశవ్



శ్రీవారి ఆలయం వెలుపల మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, ఆగస్టు 19: కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామిని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో మంత్రి కేశవ్ కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో టీటీడీ వేద పండితులు ఆయనను ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంత్రితో పాటు తెలంగాణ సీఎం రాజకీయ సలహాదారుడు వీ నరేందర్‌రెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర స్వామివారిని దర్శించుకున్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఆగస్టు 19: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు రెవెన్యూ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

ఐఏబీ సమావేశం తర్వాతే నీటి విడుదల

- చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: ఐఏబీ సమావేశంలో చర్చించి హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీ, ఎంపీఆర్ సౌత్‌కెనాల్, నార్త్‌కెనాల్ కింద ఆయకట్టుకు దామాషా పద్ధతిలో విడుదల చేయనున్నట్లు ఐఏబీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్చెల్సీకి, జిల్లాకు 2024-25 సంవత్సరానికి సంబంధించి టీబీ డ్యాం నుంచి 26.368టీఎంసీల నీటిని కేటాయించినట్లు ఐఏబీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 10టీఎంసీల నీరు తాగునీటి అవసరాలకు, మిగిలిన నీరు వ్యవసాయం, కాలువలకు దామాషా పద్ధతిలో కేటాయించ నున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 10నుంచి హెచ్‌ఎల్‌ఎంసీ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న తాగునీటి పథకాలు, నారు మడులు, ఆయకట్టు రైతుల అవసరాలు, ఆయా ఉప కాలువలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

బడ్జెట్‌లో రైల్వేకు అరకొర నిధులు

కేటాయింపులపై పింక్ బుక్ విడుదల చేసిన రైల్వే బోర్డు



గుంతకల్లు రైల్వే స్టేషన్

గుంతకల్లు, ఆగస్టు 19: కేంద్ర ప్రభుత్వం గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమ శాఖకు కేటాయింపులపై రైల్వేబోర్డు పింక్ బుక్‌ను ఆలస్యంగా విడుదల చేసింది. జోన్‌ల వారీగా పింక్‌బుక్‌ను రిలీజ్ చేసింది. దక్షిణ మధ్య రైల్వేకు విడుదలైన నిధుల్లో గుంతకల్లు డివిజన్‌కు అరకొరగా ఫండ్స్ వచ్చాయి.

రైల్వే డివిజన్‌కు వచ్చిన నిధులివే..

డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న నడికుడి-శ్రీకాళహస్తి లైన్‌కు మధ్యంతర బడ్జెట్‌లో రూ. 310 కోట్లు కేటాయించగా, ఆ మొత్తాన్ని జూలై బడ్జెట్‌లో రూ. 450 కోట్లకు పెంచారు. కడప- బెంగళూరు కొత్త లైన్‌కు ఇంటీరియం బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోగా, జూలై బడ్జెట్‌లో రూ.10 కోట్లు ఇచ్చారు. గుత్తి-ధర్మవరం లైన్ బకాయిల కోసం రూ.100 కోట్లు కేటాయించారు. నిర్మాణంలో ఉన్న గుంతకల్లు-గుంటూరు లైన్‌కు ఫిబ్రవరి బడ్జెట్‌లో రూ.283 కోట్లను కేటాయించగా దాన్ని రూ.480 కోట్లకు పెంచారు. రేణిగుంట, వాడి, గుత్తి బైపాస్ లైన్ల బకాయిల కింద ఫిబ్రవరి బడ్జెట్‌లో కేటాయించిన రూ. 83.30 కోట్లను, జూలై బడ్జెట్‌లో యథాతథంగా కేటాయించారు. అకోలా-జీన్ కొత్త లైన్‌కు, ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులకు రెండు బడ్జెట్లలోనూ నిధులు ఇవ్వలేదు. గుత్తి-పెండేకల్లు డబ్లింగ్‌కు ఇంటీరియం బడ్జెట్‌లో రూ. 150 కోట్లను కేటాయించగా పూర్తి స్థాయి బడ్జెట్‌లో రూ. వంద కోట్ల కోతపెట్టారు. తిరుపతి శాటిలైట్ స్టేషన్‌కు రూ. 7.41 కోట్లను కేటాయించారు. ఇవికాక ట్రాక్ రెన్యువల్స్, ఆర్‌యూబీలు తదితర పనులకు నిధుల కేటాయింపులు జరిగాయి. వీటిలో డివిజన్‌కు నికరంగా ఏమేరకు నిధులు లభించాయో రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ఎన్టీఆర్‌తోనే వాల్మీకులకు రాజకీయ గుర్తింపు

అనంతపురం ఎంపీ అంబికా



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న కులస్తులు

హిందూపురం, ఆగస్టు 19: రాజకీయంగా వాల్మీకులకు గుర్తింపు తెచ్చింది ఎన్టీఆర్ అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. హిందూపురంలోని వాల్మీకి భవన్‌లో సోమవారం వాల్మీకి ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మానసభ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అనంతపురం ఎంపీ, ఎమ్మెల్సీలు మధుసూదన్, మంగమ్మ, మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, పలువురు నాయకులు హాజరయ్యారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ ఎన్టీఆర్ వాల్మీకులను గుర్తిస్తే చంద్రబాబు మనల్ని చట్టసభల్లోకి పంపారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు పోరాటం చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా సమస్యలను పరిష్కరించుకోవడానికి కలిసి రావాలన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో కలిసి వాల్మీకి ఫెడరేషన్‌కు రూ.200కోట్లు కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. అమరావతిలో ఐదెకరాల స్థలంలో వాల్మీకి వికాస కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. వాల్మీకి జయంతిని సెలవుదినంగా ప్రకటించాల ని ముఖ్యమంత్రికి విన్నవిస్తామన్నారు. అనంతరం వాల్మీకి ప్రజాప్రతినిధులను కులస్థులు, వాల్మీకి ఉద్యోగ సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, సీనియర్ నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏమవుతుందో ఏమో !

- బదిలీలపై గందరగోళం
- గడువు ఇవ్వని జడ్పీ ఉన్నతాధికారులు
- కడప జిల్లాలో 25 వరకూ అవకాశం



అనంతపురం విద్య, ఆగస్టు 19: ఉద్యోగుల సాధారణ బదిలీలు జడ్పీలో గందరగోళానికి, ఆందోళనకు గురి చేస్తున్నాయి. సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన క్రమంలో ఈనెల 19 నుంచి 31లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఐదేళ్లు ఒకే స్టేషన్‌లో సర్వీసు పూర్తి చేసుకున్న వాళ్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. అయితే ఈనెల 20లోగా బదిలీలకు దరఖాస్తు చేయాలంటూ జడ్పీ అధికారులు గడువు ఇచ్చారు. కాగా ఇతర జిల్లాలో ఎక్కువ రోజులు గడువు ఇచ్చారు. కడప జిల్లాలో ఈనెల 25 సాయంత్రం వరకూ దరఖాస్తుకు గడువు ఇచ్చారు. తక్కువ గడువు ఇవ్వడంపై ఉమ్మడిజిల్లా ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలను సైతం అధికారులు సేకరించలేదు. అయితే ఆరుగురు ఎంపీడీఓలు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారి జాబితాలో ఉన్నట్లు తెలిసింది.

రంగంలోకి యూనియన్ నేత...?

బదిలీల నేపథ్యంలో ఓ యూనియన్ నాయకులు రంగంలోకి దిగినట్లు విమర్శలు వస్తున్నాయి. బదిలీల ఉత్తర్వులు రాగానే ఆ ప్రాంతానికి చెందిన యూనియన్ నేత....ఉన్నతాధికారితో తనకు పరిచయం ఉందంటూ....అంగడి తెరిచేందుకు సిద్ధమైనట్లు జడ్పీ ఉద్యోగుల ద్వారా తెలిసింది. ఉన్నతాధికారి యల్లనూరులో పని చేసినప్పుడు బాగా తెలుసునని, ఆ పరిచయంతో కోరుకున్న చోటుకు ప్లేస్ ఇప్పిస్తానంటూ బేరాలకు దిగినట్టు సమాచారం. మరి జడ్పీ ఉన్నతాధికారి, పాలకవర్గం పెద్దలు ఇలాంటి వారి పైరవీలకు చెక్ పెడతారా..? లేక వదిలేస్తారో మరి.

కూలీల వాహనం బోల్తా: 16మందికి గాయాలు



బోల్తాపడిన బొలెరో వాహనం

ధర్మవరం రూరల్,(కనగానపల్లి), ఆగస్టు 19: బొలెరో వాహనం బోల్తాపడి 16మంది కూలీలు గాయపడిన సంఘటన సోమవారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద జరిగింది. మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెద్దన్న పొలంలో పని చేయడానికి ధర్మవరం మండలం పోతుకుంట, గుట్టకిందపల్లి గ్రామాలకు చెందిన దాదపు 20మంది మహిళా కూలీలు బొలెరో వాహనంలో వచ్చారు. పనులు ముగించుకుని మధ్యాహ్న సమయంలో అదే వాహనంలో మామిళ్లపల్లి నుంచి పోతుకుంటకు బయల్దేరారు. అయితే మామిళ్లపల్లి సమీపంలోనే వాహనం స్టీరింగ్ విరిగి పోయి అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో వాహనం లో ఉన్న కూలీలు చల్లాచెదురుగా పడిపోయారు. పోతుకుంటకు చెందిన పెద్దక్క, రామక్క, ఈరమ్మ, కళ్యాణి, ముత్యాలమ్మ, రామ లక్ష్మి, గంగరత్న, సరస్వతి, అరుణ, నాగరత్న, గుట్టకిందపల్లికి చెందిన రామాంజినమ్మ, మల్లేశ్వరి, కుర్లపల్లి తండాకు చెందిన నారాయణనాయక్, లక్ష్మేనాయక్, బాలకృష్ణనాయక్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108ద్వారా క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పోతుకుంటకు చెందిన ముత్యాలమ్మ, అరుణలను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



తీవ్రంగా గాయపడి ప్రమాదస్థలం వద్ద రోదిస్తున్న మహిళా కూలీలు

బాధితులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శ

వాహనం బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డ కూలీలను ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ పరామర్శించారు. గాయపడ్డ కూలీల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

సంబరంగా రక్షా బంధనం



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రాఖీ కడుతున్న మహిళలు

ధర్మవరం/పెనుకొండ టౌన్, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సోమవారం రాఖీ పండుగను ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్క చెల్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి, ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు సైతం రాఖీలు కట్టారు. ధర్మవరంలోని సీఎన్‌బీ ప్యాలెస్‌లో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు మహిళలు పెద్దసంఖ్యలో రాఖీలు కట్టారు. అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు.



అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌కు రాఖీ కడుతున్న మంత్రి సవిత



రక్షాబంధన్ సందర్భంగా సోదరులకు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రాఖీలు కడుతున్న మహిళలు



వైకుంఠం ప్రభాకర్ చౌదరికి రాఖీలు కట్టిన తెలుగు మహిళలు



పురం ఎంపీ బీకే పార్థసారథికి రాఖీకడుతున్న బ్రహ్మకుమారీ



మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణకు...



విజయవాడలో నారాలోకేశ్‌కు రాఖీ కడుతున్న మాజీ మేయర్ స్వరూప



మంత్రి సత్యకుమార్‌కు రాఖీ కడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

వైభవంగా బలరామ జయంతి



పూజలందుకుంటున్న బలరామకృష్ణులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 19: నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో సోమవారం బలరామజయంతిని వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమికి వారంరోజుల ముందు బలరామజయంతిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం బలరామకృష్ణులను వివిధరకాల ఫలరసాలతో అభిషేకించారు. అదేవిధంగా రాధాపార్థసారథులకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఇస్కాన్ మేనేజర్ దామోదర్ గౌరంగదాస్ బలరామకృష్ణుల చరిత్రపై అనుగ్రహభాషణం చేశారు. భక్తులు స్వామివారి భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం ఇస్కాన్ ఆవరణలో భక్తులకు పెద్దఎత్తున అన్నదానవినియోగం చేశారు.

విదేశీ కోర్సులతో మెరుగైన అవకాశాలు

జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు



బీటీహెచ్ ప్రవేశాలు పొందిన విద్యార్థులతో వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 19: జేఎన్‌టీయూ, బ్లెకింగ్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల ద్వారా స్వీడన్‌లో బీటెక్ అభ్యసించవచ్చని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు తెలిపారు. తద్వారా విద్యార్థులు మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సూచించారు. జేఎన్‌టీయూలో ఆరు రోజులపాటు నిర్వహించనున్న బీటీహెచ్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాటత్లాడుతూ బీటీహెచ్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులు మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూలో చివరి సంవత్సరం స్వీడన్‌లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీ పట్టాను జేఎన్‌టీయూ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ అందజేస్తుందన్నారు. అనంతరం మాస్టర్ ప్రోగ్రామ్స్‌ను స్వీడన్‌లోనే చేయవచ్చునని సూచించారు. ఈ ప్రక్రియ విదేశాల్లో ఉద్యోగం పొందడానికి విద్యార్థులకు ఒక వరమన్నారు. అనంతరం ప్రవేశాలు పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌డీ టూ వీసీ దేవన్న, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, డైరెక్టర్లు సుజాత, కిరణ్మయి పాల్గొన్నారు.

చౌకధాన్యపు దుకాణాలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. అందులో భాగంగా జిల్లాలోని యల్లనూరు మండలం, మల్లాగుండ్ల గ్రామంలోని పెద్దిరెడ్డికి చెందిన చౌకధాన్యపు దుకాణంలో తనిఖీలు చేపట్టారు. రికార్డులను, ఉన్న నిల్వలను పరిశీలించారు. అందులో భాగంగా రికార్డుల్లో ఉన్నదానికంటే నిల్వకు వ్యత్యాసాలు ఉన్నట్లు తేలింది. దీంతో కేసునమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, యల్లనూరు సీఎస్‌డీటీ శ్వేత పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

గార్లదిన్నె, ఆగస్టు 19: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురి పేదల వివాహాలకు శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి రూ. 30వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామలింగారెడ్డి, మాజీ సర్పంచులు పుల్లన్న, సుంకన్న, వడ్డేవన్నూర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో మట్టిరోడ్లూ వేయలేదు

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
తూంచెర్లలో గుంతల రోడ్ల పరిశీలన
తారురోడ్డు నిర్మాణానికి ఆదేశాలు



తూంచెర్ల గ్రామంలో రోడ్లను పరిశీలిస్తున్న పరిటాలసునీత

ధర్మవరం రూరల్(కనగానపల్లి), ఆగస్టు 19: వైసీపీ హయాంలో కనీసం మట్టిరోడ్లు కూడా వేయలేదని, గ్రామాలకు వెళ్లే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని తూంచెర్ల గ్రామంలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తూంచెర్ల నుంచి రంగంపేటకు వెళ్తున్న మట్టిరోడ్డు అధ్వానంగా తయారైంది. వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్య ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. దీంతో ఎమ్మెల్యే పరిటాలసునీత సోమవారం పంచాయతీరాజ్ ఏఈ నారాయణస్వామి, డీఈ రామచంద్రతో కలిసి గుంతలరోడ్లను పరిశీలించారు. తారురోడ్డు వేయడానికి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. సత్యసాయి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. తాత్కాలిక రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత టీడీపీ హయాంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి 4.80కోట్లు నిధులు మంజూరుచేయించడం జరిగిందని, పనులు మొదలు పెట్టే సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రకాష్‌రెడ్డి, సోదరులు ధనదాహంతో కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను బెదిరించి పనులు చేయకుండా అడ్డుకున్నారన్నారు. దీంతో పనులు ముందుకు సాగకప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. తారురోడ్డు వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ యాతంపోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, నాయకులు శ్రీరాములు, బోర్లచెన్నప్ప, జయశంకర్, మాజీ ఎంపీపీ అలివేళమ్మ, హరి తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు

రాష్ట్ర అగ్రిమార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత



కూలీలతో మాట్లాడుతున్న విజయ సునీత

అనంతపురంరూరల్, ఆగస్టు 19: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్, రైతుబజారు సీఈఓ విజయ సునీత అన్నారు. సోమవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. చీనీ మార్కెట్‌లో కూలీలతో మాట్లాడారు. అక్కడి నుంచి షెడ్లను, యార్డును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డులోని పండ్ల మార్కెట్‌లో ఆక్షన్ నిర్వహించేందుకు అసంపూర్తిగా ఉన్న షెడ్‌ని వెంటనే పూర్తి చేయాలన్నారు. యార్డులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే సందర్భంలో యార్డ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ డైరెక్టర్‌ను కోరారు. యార్డులో పశువులు, పండ్ల మార్కెట్‌కి ఇబ్బంది లేకుండా చీనీ వ్యాపారానికి ఇబ్బందులు లేకుండా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్‌లో డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. యార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.4నుంచిరూ.5కోట్లు వరకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. వాటిని మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు, ఏడీ సత్యనారాయణచౌదరి, యార్డు ఎంపికశ్రేణికార్యదర్శిజయలక్ష్మి, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న బొలెరో

ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

గార్లదిన్నె, ఆగస్టు 19: శింగనమల మండలం లోలూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొనడంతో సత్యనారాయణరెడ్డి (45) మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పామిడి మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన సత్యానారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి సోమవారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా లోలూరు సమీపంలోకి రాగానే అనంతపురం వైపు నుంచి పామిడి వైపు వెళుతున్న బొలెరో ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సత్యానారాయణరెడ్డి మృతిచెందగా లక్ష్మీకాంతరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శింగనమల ఏఎస్ఐ చితంబరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడు మృతి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్ర సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు ఢీకొని ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరు నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న కారు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మతిస్థిమితం లేకుండా జాతీయ రహదారిపై తిరుగుతూ ఉండేవాడని తమ విచారణలో తెలిసిందన్నారు. 30-35 మధ్య వయస్సు ఉండి నలుపు రంగు బ్లూషర్టు, రంగు వెలసిన ఆకుపచ్చప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796835 నెంబర్‌కు సమాచారాం అందించాలని తెలిపారు.

సెమీస్‌కు జిల్లా బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 క్రికెట్ పోటీలు మూడు రోజులుగా మంగళగిరి స్టేడియంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జరిగిన పోటీలో అనంతపురం, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీ సాగింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ప్రశాంత్ 99 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి మొదటి ఇన్నింగ్స్ 51.1ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా బౌలర్ సాహైల్ 8 వికెట్లు తీశాడు. అనంతపురం రెండో ఇన్నింగ్స్‌లో 72.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసింది. ఇందులో ప్రశాంత్ 124 పరుగులు, లోకేష్ 67, హనీష్ 55, జయంత్ 50 పరుగులు చేశాడు. బరిలోకి దిగిన తూర్పుగోదావరి 44.1ఓవర్లలో 171పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా బౌలర్ నిశ్చయ్ 5 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం 189 పరుగుల తేడాతో విజయం సాధించింది. 22 పాయింట్లతో సెమీస్‌కు దూసుకెళ్లింది.

కారు ఢీ కొని వ్యక్తికి గాయాలు

అనంతపురం క్రైం, ఆగస్టు 19: కారు ఢీకొని పాలవ్యాపారి ఎర్రప్పకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన ఎర్రప్ప పాలు విక్రయించేవాడు. సోమవారం పాలు పోసి బైక్‌లో ఇంటికి వెళ్తుండగా కొడిమి క్రాస్‌లో వేగంగా వెళ్తున్న కారు ఢీ కొంది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆటోలో పీడీఎస్ బియ్యం తీసుకెళ్తుండగా త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. టీకేఎస్ మండలం వీరభద్రకాలనీకి చెందిన అర్జున్‌కుమార్ ఆటోలో తీసుకెళ్తుండగా నీలిమా థియేటర్ సర్కిల్‌లో పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నగరంలోని మరువకొమ్మ కాలనీలో రెండువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంజనేయులు భార్యను నరసింహులు అసభ్యంగా మాట్లాడాడనే విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. ఈ విషయంలో ఇరువర్గాలు జోక్యం చేసుకుని ఘర్షణకు దిగారు. పోలీసులు పరస్పర కేసులు నమోదు చేశారు.

మంత్రిని కలసిన వీసీ



మంత్రితో వీసీ కోరి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 19: వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి సోమవారం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేత నూతన వర్సిటీని ప్రారంభించేందుకు కృషిచేస్తామని తెలిపారు. అదేవిధంగా క్యాంపస్‌లో ఇద్దరు చొప్పున డాక్టర్లు, నర్సులను ఏర్పాటుచేస్తామని వివరించారు. వీసీతో పాటు ఎస్కేయూ ప్రొఫెసర్ మురళీధరరావు పాల్గొన్నారు.

'పారదర్శకంగా నిర్ణయాలను అమలు చేయాలి'

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల యాజమానులు సోమవారం వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావును కలిశారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలు, కక్షసాధింపు చర్యలను వివరించారు. కూటమి ప్రభుత్వంలో పారదర్శకమైన నిర్ణయాలు అమలుచేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ: జేఎన్‌టీయూ నూతన అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఈసీ)లుగా అంకారావు, శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా అకడమిక్ ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా అరుణమస్తాని బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణ, నాగప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా సోమవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్రెలుమేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు బాషా, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షుడు నాగప్ప, నాగరాజు పాల్గొన్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, ఆగస్టు 19: అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల క్రితం నమోదైన పోక్సో కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.1.50లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. 2020 ఆగస్టు 8న గుడిమల్ల వినోద్‌కుమార్‌పై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ జమాల్‌బాషా దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో కేసును సమగ్రంగా విచారించిన జడ్జి నిందితుడు వినోద్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించారు.

ఫోన్లో బెదిరించిన వారిపై కేసు

టీడీపీ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని ఫోన్లో బెదిరించిన వ్యక్తిని, ప్రోత్సహించిన మరొకరిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. యల్లనూరు మండలం సింగవరం కొత్తపల్లి గ్రామానికి చెందిన గణేష్‌నాయుడు, రమణారెడ్డి కలిసి చికెన్‌షాపు వాళ్లకు రీటైల్‌గా విక్రయిస్తుంటారు. డబ్బు ఇవ్వని కారణంగా స్నేహ కంపెనీ వారు రమణారెడ్డికి కోళ్లను ఇవ్వడం నిలిపివేశారు. దీంతో ఈనెల 4న గణేష్‌నాయుడు, రమణారెడ్డి మద్యం సేవించి ఆ మత్తులో రమణారెడ్డి ప్రోద్బలంతో గణేష్‌నాయుడు తన సెల్‌ఫోన్ నుంచి స్నేహ కంపెనీ మార్కెట్ ఎగ్జిక్యూటివ్ సత్య ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి టీడీపీ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని, మేటర్ సెట్ చేసుకోవాలని లేకపోతే కోళ్ల కంపెనీ వాహనాలను తిరగనియ్యమని ఫోన్లో బెదిరించాడు. ఈ ఆడియో కాల్ రికార్డయి, సోషల్ మీడియాలో వైరలైంది. ఈ విషయంపై పోలీసులు సత్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గణేష్‌నాయుడును అనంతపురం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

ప్రారంభమైన ఉద్యోగాల ఎంపిక రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 19: ఇంటర్మీడియేట్ పాసైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా ఉపాధి కల్పనాధికారి కల్యాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు శిక్షణ సమయంలో రూ.10వేల చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. అదేవిధంగా శాస్త్ర, అమిటి, కేఎల్ యూనివర్సిటీల్లో బీబీఏ, బీసీఏ, బీకామ్, ఎంబీఏ, ఎంకామ్ అభ్యసించేందుకు హెచ్‌సీఎల్ ఆర్థిక సహకారాన్ని అందజేస్తుందని పేర్కొన్నారు. 24న కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఉద్యోగ నియామకాల ప్రక్రియకు https:/bit.ly/TechbeeGoAP లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6363095030 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

'రస్తా సమస్యను పరిష్కరించండి'

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 19: రస్తా సమస్యను పరిష్కరించాలని చిన్నమొగలాయపల్లి గ్రామస్థులు ఇన్‌చార్జి తహసీల్దార్ అనూరాధకు విజ్ఞప్తి చేశారు. కనుముక్కల నుంచి చిన్నమొగలాయపల్లి, సీఎంపల్లి నుంచి మేడాపురం అక్కడి నుంచి ధర్మవరం వెళ్లే రోడ్డుకు ప్లాన్‌లో రస్తా ఉందని, మేడాపురానికి చెందిన రామన్న రోడ్డుపై గుంతలు తవ్వించి ఆటంకం కలిగిస్తున్నాడని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

విద్యార్థులకు శిక్షణ పూర్తి

అనంతపురం అర్బన్, ఆగస్టు 19: అనంతపురం భూసార పరీక్షా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎంఎస్‌సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులకు శిక్షణ పూర్తయ్యింది. గత నెల 29వ తేదీ నుంచి సోమవారం వరకు భూసార పరీక్ష చేసే విధానం, వాటి మూలంగా కలిగే ప్రయోజనాలపై శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజా పుష్పలత, ఏఓలు శ్రీనాథ్‌రెడ్డి, నాగేంద్ర, ఉమామహేశ్వరి, రుయాన బేగం, ప్రతాప్, అర్చన పాల్గొన్నారు.

'వైద్యులకు రక్షణ కల్పించాలి'

శింగనమల ఆగస్టు 19: ప్రభుత్వం వైద్యులకు రక్షణ కల్పించాలని సీపీఐ జిల్లా సమితి కమిటీ సభ్యుడు తరిమెల రామాంజనేయులు తహసీల్దార్ బ్రహ్మయ్యకు సోమవారం వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలకత్తాలో వైద్యురాలిపై హత్యాచారం చేశారని, వెంటనే వారిని శిక్షించాలన్నారు. లక్ష్మీరంగయ్య, ఓంకార్, పెద్దన్న తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వర్షంతో రైతుల్లో ఆనందం

గార్లదిన్నె, ఆగస్టు 19: మండలంలో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

శాస్త్రోక్తంగా ఉపాకర్మ



ఉపాకర్మ నిర్వహిస్తున్న రుత్విక్కులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 19: శ్రావణశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మూడవరోడ్డులోని బ్రాహ్మణ వసతిగృహంలో ఉపాకర్మను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుత్విక్కుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ఉపాకర్మ హోమం నిర్వహించి, అనంతరం నూతనంగా ఉపనయనం చేయించుకున్న బ్రాహ్మణ వటువులకు యజ్ఞోపవీతం మార్చారు. తదనంతరం హోమపూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యశాఖ ఏసీఓ మృతి



గోవింద్ గౌడు(ఫైల్)

అనంతపురం టౌన్, ఆగస్టు 19: జిల్లా వైద్యశాఖలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ అధికారిగా పని చేస్తున్న గోవింద్‌గౌడు(62) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. అకస్మాత్తుగా గుండెపోటురావడంతో కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యశాఖాధికారి డాక్టర్ ఈబీ దేవి, ఏఓ గిరిజా మనోహరరావు, స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్‌రఫీ, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు నివాళులర్పించి ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. డీఎంహెచ్ఓ అంత్యక్రియల నిర్వహణకు రూ25వేలు అందజేశారు.

స్టాప్‌లాగ్ ఏర్పాటులో సీఎం చొరవ అభినందనీయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: టీబీ డ్యాంలో 19వ గేటు కొట్టుకుపోయిన వెంటనే స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న చొరవ అభినందనీయమని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కన్నయ్యనాయుడు స్టాప్‌లాగ్ అమర్చి వారిలో ధైర్యం నింపారన్నారు.

మహిళా విభాగ పటిష్టతకు చర్యలు: ఎస్కేయూ వీసీ



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 19: వర్సిటీలోని మహిళా విభాగ పటిష్టతకు చర్యలు తీసుకున్నట్లు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. సోమవారం ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముగింపు అనంతరం వీసీ మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యవిద్యార్థిపై జరిగిన దురాగతం మహిళా లోకానికి కంటిమీద కనుకులేకుండా చేస్తోందన్నారు. మహిళల రక్షణకు కఠిన చట్టాలు అమలుచేయాలన్నారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ సమాజంలో అన్నిరంగాల్లో మహిళలపట్ల ఆటవిక ఘటనలు నిత్యకృత్యమయ్యాయన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఏఐఎస్ఏ నాయకులు వంశీకృష్ణ, యవన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: జిల్లా స్థాయి యోగాసన పోటీలకు సంబంధించి ఎంపిక పోటీలు ఈనెల 25వతేదీన రెవెన్యూకాలనీలోని వివేకానందభవన్‌లో ఉదయం 8గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, మారుతిప్రసాద్ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9393938447, 9963028694, 9441252258లను సంప్రదించాలని కోరారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 19: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ 21న భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు తెలిపారు. సోమవారం ఆ సమితి ఆధ్వర్యంలో ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనితను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, చంద్రశేఖర్, నాగేంద్ర, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

గుత్తి, ఆగస్టు 19: పట్టణంలో నూతన సీఐ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఐ వెంకటరామిరెడ్డి నంద్యాల జిల్లా ప్యాపిలికి బదిలీ కాగా, ఆయన స్థానంలో కర్నూలు జిల్లా ఆలూరులో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు వచ్చారు. ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

రమణమహర్షి ఆశ్రమంలో వైద్యశిబిరం

తాడిపత్రి, ఆగస్టు 19: పట్టణంలోని భగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. అనంతపురంకు చెందిన కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు పాల్గొని సుమారు 250మందికి గుండె, ఎముకలు, కంటిపరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 12మందికి గుండె సంబంధిత చికిత్స అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. 50మందికి కంటి చికిత్సకు, ఆరుగురిని ఎముకల చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపామని చెప్పా. క్లబ్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పామిడి, ఆగస్టు 19 : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో వైద్య సేవలతో పాటు మందులు, అవసరమైతే శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంతెన పరిశీలన

పామిడి, ఆగస్టు 19 : మండలంలోని అనుంపల్లి-ఇమాంపురం గ్రామాల మధ్య గల వంతెన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోతకు గురవడంతో సోమవారం టీడీపీ నాయకుడు ఆర్ఆర్ రమేష్ పరిశీలించారు. రెండు గ్రామాల మధ్య ప్రజలకు రాకపోకలకు అంతరాయంగా ఉండడంతో తాత్కాలిక మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ మహేష్, టీడీపీ నాయకులు శివ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు అభివృద్ధికి తోడ్పాటునివ్వండి

పుట్లూరు, ఆగస్టు19: మండలకేంద్రమైన పుట్లూరును అన్నివిధాలుగా అభివృద్ధి చేయడానికి తోడ్పాటు ఇవ్వాలని టీడీపీ నాయకులు పుట్లూరు పుల్లారెడ్డి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ఈ మేరకు వినతిపత్రం అందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. గ్రామంలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సిమెంట్ రోడ్లు మంజూరుచేయాలని విన్నవించారు..

పైప్‌లైన్ విషయంలో ఘర్షణ

పుట్లూరు, ఆగస్టు 19: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో బాలరాజు, నాగేంద్రలు ఇంటి ముందు పైప్‌లైను పగిలిన విషయంలో గొడవపడడంతో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. పైప్‌లైన్ పగలడంతో ఇంటివద్ద అపరిశుభ్రంగా ఉందని మాటమాట పెరిగి కట్టెలతో కొట్టుకున్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

యల్లనూరు, ఆగస్టు 19: మండలంలోని రేషన్ దుకాణాలను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మల్లాగుండ్ల గ్రామంలోని 18వ, 19వ నంబర్ల రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. స్టాక్‌లో వ్యత్యాసాలు ఉండడంతో 18వ నెంబరు దుకాణాన్ని సీజ్‌చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. విజిలెన్స్ ఎస్ఐ సంగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పెద్దవడుగూరు, ఆగస్టు19: మండలంలోని వీరేపల్లి గ్రామసమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ పెంచలయ్య (38) అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సరస్వతిపల్లె గ్రామానికి చెందిన పెంచలయ్య గ్యాస్ సిలిండర్ల లోడుతో తాడిపత్రి వెళుతుండగా ప్రమాదం జరిగింది. బ్రేక్ డౌన్ కారణంగా రోడ్డుపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పెంచలయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెడ్డెప్ప తెలిపారు.

టైలర్ షాపులో చోరీ

ఉరవకొండ, ఆగస్టు 19: పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న వంశీ టైలర్ షాపులో సోమవారం చోరీ జరిగింది. టైలర్ ఎర్రిస్వామి రూ.3లక్షల దాకా నగదును కవర్ ఉంచి షాపులో పెట్టి, షాపును చూసుకోమని కుమారుడికి చెప్పి పని నిమిత్తం బయటికి వెళ్లాడు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు షాపునకు వచ్చి బట్టలు ఆల్టేషన్ చేయాలని ఎర్రిస్వామి కుమారుడిని అడిగారు. మానాన్న లేడని, మళ్లీ రావాలని అతను తెలపగా.. గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎర్రిస్వామి షాపులోకి వచ్చి కవర్ చూడగా డబ్బులు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

రేషన్ డీలర్ల సమావేశం

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 19: శెట్టూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతనంగా నియమితులైన రేషన్ డీలర్లకు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం పంపిణీపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు గురించి తెలియజేశారు. ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు రాకుండా రేషన్ సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై నేటి నుంచి ఇంటింటి సర్వే

బెళుగుప్ప, ఆగస్టు 19: ఓటర్ల జాబితాపై బీఎల్వోలు మంగళవారం నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన బీఎల్వోల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సర్వే చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. తప్పులు లేకుండా పకడ్బందీగా సర్వే చేయాలని సూచించారు.

జీడిపల్లికి 875 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 19: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 875 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు సోమవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.693 టీఎంసీల నీరు నిల్వ వుందన్నారు.



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి వారి పల్లకిని మోస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు

అంగరంగ వైభవంగా రంగనాథుడి పెండ్లి

● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

గుత్తి రూరల్, ఆగస్టు 19: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో సోమవారం బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా వేకువజామున స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించారు. ఉదయం 8 గంటలకు లోక కల్యాణార్థం శాంతి హోమం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత బొలికొండ రంగనాథస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సం నిర్వహించారు. రాత్రి ఊంజల సేవ చేపట్టారు. రాత్రి రాష్ట్ర స్థాయి భజనలు నిర్వహించారు. స్వామి వారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఇతర నాయకులు దర్శించుకున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ కౌన్సిలర్లు

గుంతకల్లు, ఆగస్టు 19: అసంతృప్తితో ఉన్న ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. కర్నూలు జిల్లా ఆలూరులోని తన ఇంటికి వచ్చిన కౌన్సిలర్లకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పారు. 16వ వార్డు కౌన్సిలరు అర్షియా బేగం, 17వ వార్డు కౌన్సిలరు నాగరత్నమ్మ, 19వ వార్డు కౌన్సిలరు మాణిక్యమ్మ, 27వ వార్డు కౌన్సిలరు మహాలక్ష్మి, 30వ వార్డు కౌన్సిలరు చాముండేశ్వరి, 31వ వార్డు కౌన్సిలరు నగేశ్, 33వ వార్డు కౌన్సిలరు విద్యారాణి తమ కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. వైసీపీ హయాంలో వార్డుల అభివృద్ధికి నిధులు రాలేదని, ఆ పార్టీలో తగిన గుర్తింపులేక అసంతృప్తిలో ఉన్న కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారని ఎమ్మెల్యే అన్నారు. కౌన్సిలర్లు వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను తాను నెరవేరుస్తానని అన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తాడిపత్రిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు



కళ్యాణదుర్గంలో జనసేన నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

తాడిపత్రి, ఆగస్టు 19: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ప్రజా సంఘాలు, ఐక్యవేదిక నాయకులు గాంధీవిగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకుడు చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యసిబ్బంది రక్షణకు ప్రభుత్వం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలన్నారు. ఈ సంఘటన మరువక మునుపే ఉత్తరాఖండ్‌లో ఓ నర్సును ఇదేవిధంగా హత్య చేయడం దారుణమన్నారు. దేశంలో మహిళలకు భద్రత లేకుండాపోయిందన్నారు. ఇప్పటికైనా మహిళల రక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరామ్‌మూర్తి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామయ్య, ఏఐటీయూసీ నాయకులు రమణ, ఉమాగౌడ్, కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం జరిపి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో జనసేన శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సర్కిల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకుడు రాజేష్ మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే వైద్యులపై ఇటువంటి అఘాయిత్యాలు చేయడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ చేసిన ఏఎస్‌డబ్ల్యూఓ

● వంటమనిషి సహాయకుడి సస్పెన్షన్

● వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ

ఆంధ్రజ్యోతి స్పందన



మరుగు దొడ్లను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ రాధిక

విడపనకల్లు, ఆగస్టు 19: మండలంలోని గడేకల్లు ఎస్సీ బాలుర హాస్టల్‌ను గుత్తి ఏఎస్‌డబ్ల్యూఓ సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ హాస్టల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడంపై, వసతులు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంపై గత శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో ఇక్కడ ఉండలేం! అనే శీర్శికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించి ఏఎస్‌డబ్ల్యూఓ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమాటి (వంట మనిషి సహాయకుడు) బాబుని సస్పెన్షన్ చేసి, వార్డెన్ జగన్నాథ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ముందుగా అక్కడి మరుగు దొడ్లను, స్నానపు గదులను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా అని వార్డెన్‌ను ఆరా తీశారు. విద్యార్థుల చేత పనులు చేయిస్తే చర్యలు తప్పవని, హాస్టల్ ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక్కడ ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని విడపనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పెద్దలను హాస్టల్ వద్దకు పిలిపించి చర్చించారు. హాస్టల్ చుట్టూ ఉన్న వ్యాపార దుకాణాలను తొలగించాలన్నారు. వీటిలోనే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, ఇంతజరుగుతున్నా గ్రామ పెద్దలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇక మీదట ఇక్కడ ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంప్‌హౌస్ శుభ్రం

తాడిపత్రి, ఆగస్టు 19: కడపజిల్లా బాలప్పకోన వద్ద ఉన్న పంప్‌హౌస్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శుభ్రం చేయించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఐదేళ్లుగా నిర్వహణ లోపించడంతో పాచిపట్టి అపరిశుభ్రంగా తయారైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పాచిపట్టిన పంప్‌హౌస్‌ను శుభ్రం చేసి ముళ్లపొదలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలమేరకు సోమవారం ముళ్లపొదలను తొలగించారు. పంప్‌హౌస్‌ను శుభ్రం చేశారు. కడపజిల్లా గండికోట నుంచి తాడిపత్రికి తాగునీరును సరఫరా చేస్తున్నారు.

పాముకాటుతో వృద్ధురాలికి అస్వస్థత

యాడికి, ఆగస్టు 19: మండలంలోని నిట్టూరు గ్రామంలో బాలమ్మ అనే వృద్ధురాలు పాముకాటుతో అస్వస్థతకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు వివరాలిలా ఉన్నాయి. బాలమ్మ సోమవారం తెల్లవారుజామున ఇంటిలో నుంచి బయటికి రాగా పాము కాటువేసింది. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చి పాము గుర్తించి చంపేశారు. అస్వస్థతకు గురైన బాలమ్మను చికిత్స కోసం తాడిపత్రికి తరలించారు. బాలమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 19 : మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్ట గ్రామంలో రైతు అమరేంద్ర, అతని కుమారుడు విష్ణుపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపి వివరాల మేరకు.. విష్ణు తన వ్యవసాయ పొలంలోని చింత చెట్టు కింద ఉండగా తేనెటీగలు దాడి చేశాయి. విష్ణు తండ్రి అమరేంద్రకు చుట్టుపక్కల వున్నవారు ఫోన్ ద్వారా తెలియజేయగా ఆయన వచ్చి కుమారుడిని కాపాడే ప్రయత్నం చేశారు. అతడిపై కూడా తేనెటీగలు దాడి చేశాయి. ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికు తరలించారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి

యాడికి, ఆగస్టు19: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 21 వ తేదీన నిర్వహించనున్న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ రత్నకుమార్ తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల్లో విభేదాలు సృష్టించడానికి కుట్రపూరితంగా విభజనను తీసుకువచ్చారని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా తాము పోరాటాలు చేస్తామని తెలిపారు. బంద్‌కు అన్నివర్గాల వారు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ మండల అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు బాలన్న, నాయకులు ఓబయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఖాదర్‌పేట వంక

పామిడి, ఆగస్టు 19: మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఖాదర్‌పేట వంక ఉప్పొంగింది. దీంతో ఖాదర్‌పేట నుంచి పామిడికి రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే వంతెన కింద పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. కొందరు ప్రయాణికులు రైల్వే వంతెనపై నుంచి గ్రామంలోకి కాలినడకన చేరుకున్నారు.

భారీ వర్షం

విడపనకల్లు, ఆగస్టు 19: మండలవ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపుగా 2 గంటల పాటు ఎడ తెరిపి లేకుండా కురవడంతో వాగులు, వంగలు పొంగిపొర్లాయి. రోడ్లు జలమయమవడంతో ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులు పడ్డారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


యల్లనూరు, ఆగస్టు 19: మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన గాలి, వానకు విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పెద్ద ఎత్తున గాలి వీచడంతో పాటు వర్షం కురవడంతో పెద్దమల్లేపల్లి, నిట్టూరు గ్రామాల్లో చెట్లు, విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. సుమారు 45నిమిషాల పాటు వర్షం రావడంతో వంకలు, వాగులు ప్రవహించాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


యల్లనూరు, ఆగస్టు19: యల్లనూరు, వెన్నపూసపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పద్మనాభరెడ్డి సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో మరమ్మత్తు పనులు చేపడుతుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు.

గ్రామసభలను విజయవంతం చేయండి


రాయదుర్గం రూరల్, ఆగస్టు 19: ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపునకు మండలంలోని ప్రతి గ్రామంలో ఈ నెల 23వ తేదీన గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రంగనాయకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చేపట్టే ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయాలలో గ్రామ సభలు నిర్వహించే ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు.



పామిడిలో సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



బెళుగుప్ప మండలం నక్కలపల్లి ప్రభుత్వ పాఠశాలలో రాఖీ కడుతున్న బాలిక

ఘనంగా రాఖీపౌర్ణమి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీపౌర్ణమి వేడుకలను గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చెల్లెల్లు అన్నలకు రాఖీలు కట్టి మిఠాయి తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే అక్కలు తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. పలువురు ఆడపడుచులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మరీ సోదరులకు రాఖీలు కట్టారు. దీంతో ఇళ్లల్లో సందడి నెలకొంది. పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు ప్రజాపిత బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. గుంతకల్లులో డీఆర్ఎం విజయ్‌కుమార్‌కు, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు రాకీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. పామిడిలోని సరస్వతీ విద్యా మందిరంలో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. బెళుగుప్ప మండలం నక్కలపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికలు బాలురకు రాఖీలు కట్టారు.

టీబీ డ్యామ్ పరిశీలన



డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ

కళ్యాణదుర్గం, ఆగస్టు19: తుంగభద్ర డ్యామ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం పరిశీలించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్యామ్‌కు 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంతో నీరు వృధా కాకుండా అతి తక్కువ సమయంలోనే స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇందులో ఇంజనీర్లు, సిబ్బంది కృషి అమోఘమని కొనియాడారు. డ్యామ్‌ను పరిశీలించిన వారిలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హోటల్లో చెలరేగిన మంటలు

● రూ.2 లక్షల విలువ గల సామగ్రి దగ్ధం

గుత్తి, ఆగస్టు 19: పట్టణంలోని మొయిన్ బజారులో గల ఓ హోటల్‌లో సోమవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. హోటల్లో పని చేస్తున్న రంగయ్య స్టౌ వెలిగిస్తుండగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే హోటల్‌లో ఉన్న సామగ్రి మొ త్తం కాలిపోయిందని హోటల్ నిర్వాహకుడు సత్య వాపోయాడు. దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 19: గుంతకల్లు నియోజకవర్గంలో ఉచిత ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ ఉదయ్‌భాస్కర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి ఇసుకను తెచ్చుకోవడానికి రవాణా ఖర్చులు వేలాది రూపాయలు అవుతున్నాయన్నారు. కాబట్టి నియోజకవర్గంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమీప వాగుల్లో వంకల్లో అందుబాటులో ఉన్న ఇసుకను ట్రాక్టర్లు, ఎద్దుల బండి ద్వారా తెచ్చుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, బాషా, గోపి, రామదాసు, విశ్వనాథ్, నాగార్జున పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల అందజేత

గుంతకల్లు టౌన్, ఆగస్టు 19: పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సోమవారం రాజ్ ఫౌండేషన్ వారు మెరిట్ స్కాలర్ షిప్‌లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది డిగ్రీ ప్రథమ సంవత్సరం బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీబీఏ, బయోటెక్నాలజీ గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాజ్ ఫౌండేషన్ వారు స్కాలర్ షిప్‌లను అందజేస్తుండడం అభినందనీయమన్నారు. బీకాం కంప్యూటర్స్‌లో ఆయేషాజహాన్, బీబీఏలో గీతిక, బయోటెక్నాలజీలో ఆఫ్రిన్‌లకు ప్రథమంగా ఒక్కొక్కరికి రూ.5వేలు, ద్వితీయ స్థాయిలో జాన్సిషైలిని, స్నేహకు ఒక్కొక్కరికి రూ.3వేలు, తృతీయ స్థాయిలో ఉషాక్‌బాషా, అమానుల్లా, శర్మాస్‌బీలకు ఒక్కొక్కరికి రూ.2వేలు అందజేశారు. అధ్యాపకులు బసెట్టి క్రిష్టయ్య, శివయ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని వినతి

యాడికి, ఆగస్టు 19: బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ బీఎల్వోలు సోమవారం మండలకేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు రెండున్నర సంవత్సరాల నుంచి రావాల్సిన గౌరవ వేతనం నేటివరకు చెల్లించలేదని తెలిపారు. సాధారణ ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడినప్పటికీ గౌరవవేతనం చెల్లించకపోవడం దారుణమన్నారు. మళ్లీ సర్వేలు మొదలవుతున్నాయన్నారు. పాత బకాయిలు చెల్లించకుండా మళ్లీ సర్వే పనులు చేయాలని ఆదేశాలు ఇవ్వడం సమంజసమా అని ప్రశ్నించారు. రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారు కోరారు. వివిధ గ్రామాల బీఎల్వోలు పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 19: 18 ఏళ్ల వయసు నిండిన యువత ఓటు హక్కుకు అర్హులని, అలాంటివారందరికీ తప్పకుండా ఓటుహక్కును కల్పించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన బీఎల్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హుల గుర్తింపునకు మంగళవారం నుంచి ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి ఇంట్లో డబుల్ ఎంట్రీలు, ఇతర మార్పులు, చేర్పులు ఉంటే దరఖాస్తులను స్వీకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం- 6 దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, గుర్తింపు పొందిన మార్క్స్ కార్డు లేదా స్టడీ సర్టిఫికెట్‌ను జతపరచి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధరూఢస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రాయదుర్గం రూరల్, ఆగస్టు 19: మండలంలోని కెంచానపల్లి గ్రామంలో సోమవారం సిద్ధరూఢస్వామి విగ్ర హ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇంచలి శివానంద భారతి స్వామీజీ వచ్చి ఉదయం 9.29 నుంచి 10 గంటల వరకు విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

● భూ వివాదం పరిష్కారం కాకపోవడంతో ఆవేదన



బొమ్మనహాళ్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాధిత రైతు సుంకన్న

బొమ్మనహాళ్, ఆగస్టు 19: భూ వివాదాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు పరిష్కరించడం లేదని ఆవేదన చెందిన సుంకన్న అనే రైతు.. తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం గొంతు కోసుకున్నాడు. ఈ ఘటన బొమ్మనహాళ్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడికి స్థానికంగా ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో బళ్లారి విమ్స్‌కు తరలించారు. బొమ్మనహాళ్ మండలం తార్కాపురం గ్రామానికి చెందిన తన తండ్రి లింగప్ప కళ్లదేవనహళ్లిలో 63-సీ-2ఏ-3 సర్వే నంబరులో 6.68 ఎకరాల భూమిని 1974లో కొనుగోలు చేశాడని సుంకన్న తెలిపాడు. అందులో 2.50 ఎకరాల భూమి కబ్జాకు గురైందని వాపోయాడు. విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన శాంతమూర్తి ఒక ఎకరం, గోవిందవాడ గ్రామానికి చెందిన నరసింహులు 1.50 ఎకరాల భూమిని కబ్జా చేసి, పాసుపుస్తకాలు చేయించుకున్నారని అన్నాడు. తన భూమిని తనకు ఇప్పించాలని 15 ఏళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని అన్నారు. కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయాడు. కబ్జాకు పాల్పడినవారు వైసీపీ హయాంలో తనపై అక్రమంగా కేసు పెట్టించారని ఆరోపించాడు. పది మంది తహసీల్దార్లు మారినా తన సమస్య పరిష్కారం కాలేదని, అందుకే ఆత్మహత్య చేసుకోవాలని గొంతు కోసుకున్నానని తెలిపాడు. ఏఎస్ఐ హనుమంతరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. ఈ ఘటనపై తహసీల్దారు మునివేలును సంప్రదించగా, సుంకన్న కార్యాలయంలోకి రాలేదని, బయటే ఆత్మహత్యకు యత్నించాడని తెలిపారు. 63-సీ-2ఏ-3 సర్వే నంబరులో ఒక ఎకరం భూమి ఇతరుల పాసుబుక్‌లో నమోదైందని అన్నారు. ఈ విషయంపై సుంకన్న హైకోర్టుకు వెళ్లారని, సమస్య కోర్టు పరిధిలో ఉందని తెలిపారు.

దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న దొంగలు

రాయదుర్గం, ఆగస్టు 19: సీబీఐ సీజ్ చేసిన వాహనాలను గ్యాస్ కట్టర్లతో కట్ చేస్తున్న పదిమందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. ఆయన సోమవారం రాత్రి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. డీ.హిరేహాళ్ మండలంలోని ఓబుళాపురం మైనింగ్‌లో సీబీఐ సీజ్ చేసిన వాహనాలను దొంగలిస్తుండగా బళ్లారికి చెందిన ఖాలీద్, తౌసిఫ్, ఉలిగప్ప, రియాజ్ అహ్మద్, బషీర్, రేణుకప్ప, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖాసీఫ్‌ఖాన్, అమన్, రవూఫ్‌ఖాన్, సిద్ధాపురం గ్రామానికి చెందిన భాస్కర్‌లను అరెస్టు చేశామన్నారు. ఓఎంసీలో ఉన్న జేసీబీ, హిటాచిలను కట్టర్లతో కట్ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 13.48 లక్షలు ఉంటుందని తెలిపారు. అదుపులో తీసుకున్న వారి నుంచి 17 గ్యాస్ సిలిండర్లు, బొలెరో వాహనం, రెండు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సోమవారం రాయదుర్గం కోర్టులో హాజరుపరచగా వీరిని 15 రోజులు రిమాండ్‌కు హాజరుపరచినట్లు తెలిపారు.